క్లుప్తంగా

నేడు ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం


మాట్లాడుతున్న శివాజీ

పెందుర్తి: పెందుర్తి పాత ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయ 39వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బుద్ధ శివాజీ తెలిపారు. ఆదివారం పెందుర్తిలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం నుంచి ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 నుంచి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. భక్తులంతా తరలివచ్చి ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

సబ్బవరం: మండలంలోని పైడివాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పాల సొసైటీ ఎన్నికల్లో ఇద్దరు పాడి రైతులను డైరెక్టర్లుగా సొసైటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పాల సొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకట రమణ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో పదవీకాలం పూర్తయిన ఇద్దరు డైరెక్టర్లు రాజీనామా చేయడంతో వారి స్థానంలో నూతనంగా దాసరి ప్రసాద్, బొబ్బరి పెంటయ్యలను ఏకగ్రీవంగా సభ్యులంతా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు దాసరి వెంకట రమణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ అభివృద్ధితో పాటు పాడి రైతుల సంక్షేమానికి డైరెక్టర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దాసరి అక్కునాయుడు,వడ్డాది పెంటయ్య, సురేష్,కోమటి రమణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

దాబాగార్డెన్స్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. విజయనగరానికి చెందిన మ్యూజిక్ స్క్వాడ్ సరిగమప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నో ప్రయాసలతో సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. వర్ధమాన గాయకులు పి. రాంబాబు, పూర్ణిమ, సీహెచ్‌వీ సత్యనారాయణ, శైలజా మీరజ్, భాగ్యలక్ష్మి, పుండరీకుమార్, రామరాజు, కందర్ప రాధ తదితరులు పలు తెలుగు చిత్రాల్లోని మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించగా కొణతాల రాజు, చెన్నా తిరుమల రావు, జేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సమాజంలో అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలన్నారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే ఊరుకోబోమని రౌడీషీటర్లను ఎస్‌ఐ హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

ముగిసిన సంగీత కచేరీలు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన సంగీత కచేరీలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా ఆదివారం ముంబయికి చెందిన అదితి సుదర్శన్ వేణు గానంతో సంగీత ప్రియులను ఓలలాడించారు. అనంతరం కుమారి కోట, గాయత్రీ వరేణ్యులు గాత్ర కచేరీతో అలరించారు. అకాడమీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పేరాల బాలమురళి, తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- జిల్లాలో ఈద్–ఉల్–అద్హా నిర్వహణకు ఏర్పాట్లు
- ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ ప్రార్థనలు
- సర్వ మానవాళి కోసం దువా చేయనున్న మతపెద్దలు


విద్యుత్ కాంతులతో యాసీన్ మసీదు


ఇస్లాంపేటలోని మసీదు

పెదగంట్యాడ: త్యాగానికి ప్రతీక పవిత్ర బక్రీద్... ఈద్ ఉల్ అద్హా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ నమాజ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 6 గంటల నుంచే శుద్ధి స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి.. 'అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్... లా ఇలాహ ఇల్లల్లా... హు అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్' అంటూ తక్బీర్ చదువుకుంటూ ఈద్గాలకు చేరుకుంటారు. ఈద్ ఉల్ అద్హా కోసం ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చేస్తారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించే ఖాజీలు, మౌల్వీలు తమ ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేస్తారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకుంటారు. నమాజ్, దువా అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. కొందరు బక్రీద్ సందర్భంగా ఉపవాసాలు ఉంటారు. పండగ నేపథ్యంలో ఈద్గాలు, మసీదులను విద్యుత్‌కాంతులతో సిద్ధం చేశారు.

ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండగల్లో బక్రీద్ ఒకటి...ధనిక పేద తారతమ్యం లేకుండా ఈ పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతిరూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తర్వాత అంత ప్రాముఖ్యత ఉన్న పండగ ఈదుల్ అజహా (బక్రీద్) దీనిని త్యాగాల పండగ అని కూడా పిలుస్తారు.

ఖుర్బానీకి ప్రాధాన్యం

దేశ వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీద్ పండగను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. అందులో ఒక భాగాన్ని నిరుపేదలకు పంచిపెడతారు. మిగిలిన రెండు భాగాల్లో ఒక భాగాన్ని బంధువులకు మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీనినే ఖుర్బానీ అంటారు.

మార్కెట్‌లో సందడి

మార్కెట్లో బక్రీద్ సందడి షురూ మొదలైంది. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల కొనుగోళ్లు ప్రారంభించారు. ఖుర్బానీ ఇవ్వడం కోసం గాజువాక పరిసర ప్రాంతాల నుంచి ఇప్పటికే పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. బక్రీద్ వస్తుదంటే వ్యాపారులకు గిరాకీ పెరుగుతుంది. వారం రోజుల నుంచి కొత్త బట్టలు కొనుగోలు చేస్తారు. పండగ సామగ్రిని సిద్ధం చేసుకుంటారు.

ప్రత్యేక ప్రార్థనలు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఇస్లాంపేట, మదీనాబాగ్, పెదపాలెం, చినపాలెం, నడుపూరు తదితర ప్రాంతాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈద్ గావ్‌లకు తరలివెళ్లి ఈ ప్రార్థనలు చేస్తారు.

త్యాగ నిరతికి నిదర్శనం



బక్రీద్ పండగ మనిషికి దైవభీతి, త్యాగ నిరతిని తెలియజేస్తుంది. అందుకే దీనిని త్యాగాల పండగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండగ ప్రత్యేకత. బక్రీద్ పండగ సందర్భంగా ప్రతి ముస్లిం పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ.

–మహ్మద్ నజీర్, ఇస్లాంపేట

సేవా గుణం ఉండాలి

ప్రవక్తల త్యాగానికి ప్రతీక బక్రీద్. ఆనాడు వారు అనుసరిస్తే.. నేడు పండగలా జరుపుకుంటున్నాం. ప్రవక్తల జీవితాలు, వారు అనుసరించిన విధానాలను ఆదర్శంగా తీసుకొని అనుసరించాలి. చెడు మార్గాలకు దూరంగా, మంచి, శాంతి మార్గాల్లో నడవాలి. సేవా గుణం కలిగి ఉండాలి. పండగ తర్వాత కూడా ఇదే స్ఫూర్తితో మెలగాలి.

– ఖాసీమ్ సాబ్, జామీయా మసీదు, చెంగల్రావుపేట, విశాఖపట్నం

నృసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు


తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఎర్నిమాంబ అమ్మవారికి దశమి పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠమాస శుద్ధ దశమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

యువకుడిని కాపాడిన ఎంవీపీ పోలీసులు

ఎంవీపీ కాలనీ : కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని ఎంవీపీ పోలీసులు కాపాడారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలి మండలం ఉప్పాడకు చెందిన మామిడి సంతోష్(30) కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అప్పుఘర్ సముద్ర తీరంలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీనిపై కుటుంబ సభ్యుల సమాచారంతో అప్పుఘర్ తీరానికి చేరుకున్న పోలీసులు.. ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం అతని భార్యకు సమాచారం అందించారు. దీంతో సంతోష్ భార్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

తీరంలో పర్యాటకుల సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. అనకాపల్లి, గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, పెదముషిడివాడ, పరవాడ, వాడచీపురుపల్లి, దీపాంజలినగర్ ప్రాంతాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తీర ప్రాంతాలకు చేరుకొని ఆట పాటలతో సందడి చేశారు. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడిన పర్యాటకులు సాయంత్రం తీరంలో జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.

ముళ్లపొదలతో ముప్పు!


వెన్నలపాలెం రహదారిలో వంతెనను ఆక్రమించిన ముళ్ల పొదలు


వంతెన వద్ద అడ్డంగా పెరిగిన ముళ్ల పొదలు

పరవాడ: ఎన్టీపీసీ–వెన్నలపాలెం రహదారి ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ, స్టీల్ ప్లాంట్ వంటి పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వందల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు వాహన చోదకులను ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. ఇక్కడ నిర్మించిన వంతెన ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలతో రహదారి మూసుకుపోయింది. అంతేకాకుండా వంతెన దిగువన నీరు ప్రవహించే రంధ్రాలకు అడ్డంగా ముళ్ల పొదలు ఉండడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారిలో పెరిగిన ముళ్ల పొదలతో పాటు వంతెన రంధ్రాలకు అడ్డంగా పెరిగిన పొదలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లాభాల్లో ఉన్న ఉక్కుపై కుట్ర


శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: గత ప్రభుత్వాల కుట్రలతోనే లాభాల విశాఖ ఉక్కు నష్టాల ఊబిలో కూరుకుపోయిందని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, కామేశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు ఆదివారం నాటికి 1221వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో వారు మాట్లాడారు. అత్యధిక లాభాలతో నడిచిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీకిపై ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సన్యాసిరావు, మహాలక్ష్మినాయుడు, డేవిడ్, ప్రసాద్ మాట్లాడగా, ఏఐటీయుసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శేష వాహన సేవలో తిరుమలేశుడు


శ్రీవారిని శేషవాహనంలో ఊరేగిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తిరుమలేశునికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. వేకువ జామునే దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి సుప్రభాత, అర్చన అనంతరం భక్తులకు తిరుమల బాలాజీను దర్శనం కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామికి విశ్వక్సేన పూజలు, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, ధాతాది మూల హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం, అనంతరం శ్రీవారిని పెద్ద శేష వాహన సేవను అంగరంగ వైభవంగా ఊరేగించారు. సాయంత్రం వేంకటేశ్వరునికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, పారమాత్రిక మహా శాంతి హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం పూజల అనంతరం గరుడ వాహన సేవను ఘనంగా నిర్వహించిన అనంతరం ప్రసాద వితరణ గావించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

సందడిగా కైలాసగిరి



ప్రత్యేక ఆకర్షణగా ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్


కైలాసగిరిపై 9డీ సినిమా థియేటర్ వద్ద సందర్శకులు


గుర్రాలపై రైడ్ చేస్తున్న చిన్నారులు

ఆరిలోవ: కైలాసగిరికి రెండు రోజుల నుంచి సందర్శకుల తాకిడి పెరిగింది. అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి ఇక్కడ పచ్చని మైదానాలు, పిల్లలు ఆట స్థలాలు, పరికరాల వద్ద సందడి చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వ్యూ పాయింట్ వద్ద ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో సందర్శకులు దూరంగా నిల్చుని ఫొటోలు దిగారు. ఈ వ్యూ పాయింట్ నుంచి సముద్ర తీరం, బీచ్ రోడ్డు అందాలు రుషికొండ వరకు కనిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ సెల్ఫీలు తీసుకుంటూ ముచ్చటపడుతున్నారు. కొండపై శివపార్వతుల విగ్రహాల పక్కనే ఈ వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు. కైలాసగిరిపై ప్రధాన ద్వారం వద్ద ఇటీవల '9డీ'సినిమా థియేటర్ ఏర్పాటు చేశారు. ఈ థియేటర్ మరింత సందడిగా మారింది. ఇందులో 10 నిమిషాల పాటు వేసే 9డీ సినిమాను పిల్లలు, పెద్దలు చూడడానికి ఆసక్తి కనబరిచారు. ఈ 9డి సినిమాలో 6 ఫిల్మ్‌లు ఉంటాయి. వాటిలో ఏది కావాలంటే ఆ ఫిల్మ్ చూపుతారు. 3డీ సినిమా మాదిరిగా మరింత డెవలప్‌మెంట్‌తో 9డీ సినిమా ప్రదర్శిస్తున్నారు.

బాల సాహిత్యం కోసం కృషి

సీతంపేట: బాలబాట బాలల మాసపత్రిక బాలల నాటిక రచనల పోటీ బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలబాట సంపాదకురాలు స్వరాజ్యం వెంకటరమణమ్మ మాట్లాడుతూ బాలల కోసం, బాలల చేత మాసపత్రిక ప్రచురిస్తున్నట్టు తెలిపారు. బాల సాహిత్యం, బాలల కోసం కథలు, రచనలు మరిన్ని రావాలన్నారు. రచయితలు కూడా బాలల కోసం మరిన్ని రచనలు చేయాలని కోరారు. విద్యార్థి దశలోనే బాలలకు సాహిత్యంపై ఆసక్తి కల్పించేలా పాఠశాల స్థాయిలో కథలు, కవితలు రచించేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పోటీలో ప్రథమ బహుమతి గెలుపొందిన ఎస్.మంగరత్నం(కాకినాడ), ద్వితీయ బహుమతి సింహాద్రి నాగశిరీష (హైదరాబాద్), తృతీయ బహుమతి సిహెచ్.చిన సూర్యనారాయణకు బహుమతి ప్రదానం, నగదు పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

మర్రిపాలెం: ఆత్మహత్యాయత్నం చేసుకుని చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దరి తిక్కవానిపాలెం శివాలయం వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న వై.దిలీప్‌కుమార్(22) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరు ఒక ఏడాది నుంచి దూరంగా ఉంటున్నారు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో ఈ నెల 13న చెదలమందు తీసుకుని, వెంటనే చున్నీతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గమనించిన ఇరుగుపొరుగు వారు బయట ఉన్న అతడి తండ్రికి తెలిపారు. దిలీప్‌కుమార్ స్నేహితులు, చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకి దించి చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మనస్థాపంతో తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెంది ఉండవచ్చని దిలీప్ తండ్రి నరసింహమూర్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేపట్టారు. దిలీప్‌కుమార్ మరణానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.